క్లుప్తంగా

ఇలక్కియకు గ్రంథాలయ సంస్థ ఇన్‌చార్జి అభినందనలు



జేసీ ఇలక్కియకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న గ్రంథాలయాధికారి శ్రీనివాసరావు

బాలాజీచెరువు: జిల్లా గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇన్‌చార్జిగా నియమితులైన జేసీ ఎస్. ఇలక్కియను గాంధీనగర్ లైబ్రేరియన్ ములంపాక శ్రీనివాసరావు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసారు. నగరంలో అత్యంత ప్రాధాన్యమున్న కుళాయి చెరువు పార్కు అవరణలో గల గాంధీనగర్ గ్రంథాలయంలో సౌకర్యాలు, కార్యక్రమాలను వివరించారు.

నాణ్యతతో అంగన్‌వాడీ భవన నిర్మాణాలు

కాకినాడ రూరల్: నియోజకవర్గంలో నాడు–నేడు పథకం కింద మంజూరైన అంగన్‌వాడీ భవనాలను నాణ్యతతో నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు ఐసీడీఎస్ పీడీ కె.ప్రవీణ పేర్కొన్నారు. రమణయ్యపేటలో రూరల్ మండల పరిషత్ కార్యాలయం సమావేశపు హాలులో శుక్రవారం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని హెచ్ఎంలు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, అంగన్‌వాడీ వర్కర్లు, సూపర్ వైజర్లకు శిక్షణ ఇచ్చారు. మొత్తం 136 భవనాలు మంజూరయ్యాయని వాటికి నాణ్యమైన సామగ్రితో నిర్మించాలని అన్నారు. రయ్యాయన్నారు. నిర్మాణాలకు వినియోగించే మెటీరియల్ నాణత్య ఉండాలన్నారు. పెద్దాపురం సీడీపీఓ ఉషారాణి మెటీరియల్‌ను ఏ విధంగా రిఫర్ చేయాలో వివరించారు. భవన నిర్మాణాలకు అభివృద్ధి కమిటీ ఏర్పాటు చేయాలని, ఆ కమిటీ ద్వారా మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

నిత్యావసర సరకుల పంపిణీ

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు విశ్రాంత తహసీల్దార్ రేలంగి బాపిరాజు శుక్రవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. డాక్టరు గుబ్బల లక్ష్మణ ప్రసాద్, అడబాల రత్న ప్రసాద్, రెడ్నం రాజా, రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

'క్రియ' పండగను విజయవంతం చేయాలి

బాలాజీచెరువు: పాఠశాల స్థాయి విద్యార్థుల్లో ఉన్న కళా నైపుణ్యాల ప్రదర్శనతో పాటు వారి ప్రతిభను నిరూపించడానికి ఏర్పాటు చేసే క్రియ పిల్లల పండుగ విజయవంతం చేయాలని ఆ స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి జగన్నాథరాజు శుక్రవారం తెలిపారు. జేఎన్‌టీయూకే ఆవరణలో శని, ఆదివారాల్లో రెండు రోజుల పాటు ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, 29 అంశాలకు సంబంధించి వివిధ విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 324 పాఠశాలల నుంచి 10,500 మంది రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. పోటీలు సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో నిర్వహిస్తామని, న్యాయ నిర్ణేతల నిర్ణయం మేరకు ఆదివారం బహుమతులు అందజేస్తామన్నారు.

శేషశయనుడిగా సీతారామస్వామి

బోట్‌క్లబ్: రజిత చిన్న దశావతార అలంకార ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం సీతారామస్వామి శేషశయన అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామికి ఆలయ ప్రధాన అర్చకులు భావవరపు భాస్కరాచార్యులు ఆధ్వర్యంలో పంచామృతాభిషేకాలు నిర్వహించారు.

వ్యాసరచన పోటీల విజేతలకు అభినందనలు

బాలాజీచెరువు: భగవాన్ సత్యసాయి సేవా సంస్థ నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను శుక్రవారం ఆదిత్య కళాశాల అకడమిక్ డైరెక్టర్ బీఈవీఎల్ నాయుడు తన చాంబర్‌లో అభినందించారు. మానవత్వమును పెంపొందించు విద్యావశ్యకత అంశంపై పోటీలు నిర్వహించగా విద్యార్థులు ఆదిలక్ష్మి ప్రథమ స్థానం, శ్రీదుర్గ తృతీయ స్థానం సాధించారు. విద్యార్థులను కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, పీవో తేజేశ్వరరావు అభినందించారు.

ఘనంగా క్షీరాబ్ది ద్వాదశి పూజలు

కరప: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం రాత్రి మహిళలు క్షీరాబ్ది ద్వాదశి పూజలు నిర్వహించారు. మహిళలు తమ ఇళ్ల వద్ద విష్ణాలయాల్లో వేదపండితులతో ప్రత్యేక పూజలు చేసి ఉసిరి, దీపం, వస్త్రం దానంచేసి, ఆశీర్వాదం తీసుకున్నారు. యండమూరు వెంకటేశ్వరస్వామి ఆలయంలో సామ్రాజ్యలక్ష్మి, గోదా సమేత వెంకటేశ్వరస్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి అర్చకుడు పెద్దింటి సీతారామాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో..

బోట్‌క్లబ్: స్థానిక దేవాలయంవీధిలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో క్షీరాబ్ధి ద్వాదశి సందర్భంగా శుక్రవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు పొందూరు కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో స్వామికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ద్వాదశి దీపాలంకార సేవ నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పాలనా దక్షుడు జగన్

- సంక్షేమం, అభివృద్ధి కొత్త పుంతలు
- కొత్త భవనాలతో గ్రామాలు కళకళ
- రూపు మారుతున్న పల్లెల స్వరూపం

కాకినాడ సిటీ: వైఎస్సార్ సీపీ నాలుగున్నర ఏళ్ల పాలన అభివృద్ధి, సంక్షేమానికి సరికొత్త నిర్వచనం. సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, పాల సేకరణ కేంద్రాలు, విలేజ్ క్లినిక్‌లు, డిజిటల్ లైబ్రరీల భవనాలు, సరికొత్త హంగులతో పల్లెలు కళకళలాడుతున్నాయి. మరో వైపు జగనన్న కాలనీలతో పల్లెల రూపురేఖలు మారిపోతున్నాయి. పచ్చని పంటలు, పాడితో సుభిక్షంగా ఉన్నాయి. ఓ వైపు వ్యవసాయ పనులు, ఇంకో వైపు ఉపాధి పనులతో పాటు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజల జీవన స్థితిగతులు మెరుగుపడ్డాయి. గ్రామ స్వరాజ్యాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేశారు. పదిన్నరేళ్ల కాలం రాష్ట్ర ప్రజల ఆర్థిక స్వావలంబనకు టీటీపీ అడ్డంకిగా మారింది. అయితే అధికారంలోకి వచ్చిన నాలుగున్నరేళ్లలోనే సీఎం జగన్ అభివృద్ధి, సంక్షేమానికి కొత్త నిర్వచనం సూచించారు. రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభం వెంటాడుతున్నా, ప్రతిపక్షాలు ఎన్ని విమర్శలు చేస్తున్నా సంక్షేమ పథకాలను అప్రతిహతంగా కొనసాగిస్తున్నారు. సచివాలయ వ్యవస్థలో వలంటీర్లను ప్రవేశపెట్టడంతో పల్లె ప్రజలకు ప్రభుత్వ పరమైన సమస్యలు తీర్చుకునేందుకు సులభమైంది. సచివాలయాల్లో వివిధ శాఖల ఉద్యోగులు అందుబాటులో ఉంటూ 540కి పైగా సేవలు ప్రజలకు అందిస్తున్నారు. ఆరోగ్యానికి పెద్దపీట వేస్తూ విలేజ్ క్లినిక్‌లు, రైతులకు ఆర్‌బీకేలు, పాడి అభివృద్ధి చేసేలా పాల సేకరణ కేంద్రాలు తదితర కార్యక్రమాల ద్వారా ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నారు.



రైతులకు సేవలు అందిస్తున్న రైతు భరోసా కేంద్రం

భవనం	నిర్మాణ విలువ
సచివాలయం	రూ. 40 లక్షలు
రైతు భరోసా కేంద్రం	రూ. 21.80 లక్షలు
విలేజ్ హెల్త్‌క్లినిక్	రూ. 17.50 లక్షలు
పాలసేకరణ కేంద్రం	రూ. 17.50 లక్షలు
డిజిటల్ లైబ్రరీ	రూ. 16 లక్షలు

నాడు–నేడుతో విద్యకు పెద్దపీట

ఇదిలా ఉండగా విద్యకు పెద్ద పీట వేస్తూ నాడు–నేడు పథకంలో భాగంగా కోట్లాది రూపాయలు నిధులు మంజూరు చేసి గ్రామాల్లో అనేక ప్రభుత్వ పాఠశాలల పాత భవనాలను తొలగించి నూతన భవనాలు ఏర్పాటు చేయడం, అదనపు తరగతి గదులు నిర్మించడంతో నాణ్యమైన విద్య ప్రభుత్వ పాఠశాల్లో అందుబాటులోకి వచ్చింది.

పల్లెల దగ్గరకే ప్రభుత్వం వచ్చింది



గత ప్రభుత్వాల పాలనకు భిన్నంగా సీఎం జగన్ గ్రామాలకే సచివాలయ వ్యవస్థతో ప్రభుత్వాలను తీసుకువచ్చారు. ప్రజలకు కావలసిన ధ్రువ పత్రాలు సహా, ఇప్పుడు రిజిస్ట్రేషన్లు సైతం సచివాలయాల్లో జరగనుండడం శుభపరిణామం. ప్రజలకు అందుబాటులో ప్రభుత్వం ఉండడంతో అందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– బొమ్మిడి నయోమి, సర్పంచ్, ఉప్పలంక

ప్రజలకు ఎంతో మేలు



సచివాలయ వ్యవస్థతో ఎంతో మంది పేదలకు గ్రామాల్లోనే ఎన్నో సౌకర్యాలు అందుతున్నాయి. గతంలో నెలల తరబడి ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి చేయించుకునే పనులు గంటల వ్యవధిలోనే చేస్తున్నారు. ఏ సమస్య ఉన్నా వలంటీర్లు తెలుసుకుని చేస్తున్నారు.

– బలగం ప్రసన్నకుమార్, మాజీ సర్పంచ్, తూరంగి

ప్రధానమంత్రి విశ్వకర్మ పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

కాకినాడ సిటీ: మైనారిటీ వర్గాలకు చెందిన వివిధ చేతి వృత్తిదారుల నుంచి ప్రధానమంత్రి విశ్వకర్మ పథకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకులు ఎం.సునీల్ కుమార్ శుక్రవారం తెలిపారు. 18 రకాల వృత్తి పనులు చేసుకునే వారు అర్హులన్నారు. స్వర్ణకారులు, శిల్పాలు, విగ్రహాలు తయారు చేసేవారు, వడ్రంగి, కుమ్మరి, ధోబీ, టైలర్, చేపల వలలు తయారీదారులు తదితరులు అర్హులన్నారు. అభ్యర్థులు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, కులధ్రువీకరణ పత్రం, బ్యాంకు పాస్ పుస్తకం కలిగి ఉండాలన్నారు. వయస్సు 18 ఏళ్లు నిండి ఉండాలన్నారు. అర్హులైన వృత్తిదారులు తమ ధ్రువీకరణ పత్రాలతో మీ సేవా, సీఎస్‌సీ కేంద్రాల్లో వెబ్‌సైట్‌లో తమ దరఖాస్తులను నమోదు చేసుకోవచ్చని సునీల్‌కుమార్ వివరించారు.

మహాధర్నా జయప్రదం చేయండి

కాకినాడ సిటీ: ఈనెల 27, 28 విజయవాడ జింఖానా గ్రౌండ్‌లో జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ కేంద్ర కార్మిక సంఘాలు, ఏపీ రైతు సంఘాల సమన్వయ సమితి ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ఆటో ప్రచారజాతాను సీఐటీయూ జాతీయ ఉపాధ్యక్షురాలు జి బేబీరాణి ప్రారంభించారు. మోడీ ప్రభుత్వం 9 ఏళ్ల పాలనలో రైతాంగ సంక్షోభం పెరిగి ప్రతి 20 నిమిషాలకు ఒక రైతు ఆత్మహత్య చేసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు దువ్వా శేషుబాబ్జీ, చెక్కల రాజ్‌కుమార్, మలక వెంకటరమణ పాల్గొన్నారు.

అంబేడ్కర్ భవనాల నిర్మాణానికి పెద్ద పీట

ఎమ్మెల్యే కురసాల కన్నబాబు



అంబేడ్కర్ సామాజిక వికాస భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ రూరల్: అంబేడ్కర్ భవనాల నిర్మాణానికి నియోజకవర్గంలో పెద్ద పీట వేస్తున్నామని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. మండలంలోని వాకలపూడిలో అంబేడ్కర్ సామాజిక వికాస భవన నిర్మాణానికి శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. గ్రామంలో 40 ఏళ్ల కల అంబేడ్కర్ భవనం నిర్మాణం తమ ప్రభుత్వ హయాంలో నెరవేరుతోందన్నారు. జనవరి నెలాఖరుకు ప్రారంభించేలా శనివారం నుంచి పనులు ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. మీ ఆప్యాయత, అనురాగంతో రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారంలో రావడంతో సీఎంగా జగన్, ఎమ్మెల్యేగా తాను సేవలందిస్తున్నామని, రానున్న సంక్రాంతికి పగటి వేశగాళ్లలా కొన్ని పార్టీలు కలిసి మీ ముందుకు వస్తాయన్నారు. ఏడాదిలో ఎన్నికలు రానున్న నేపథ్యంలో సంక్రాంతికి వచ్చే పగటి వేషగాళ్లలా ప్రజలకు మేలు చేయడానికి కాకుండా జగన్‌ను ఓడించడమే లక్ష్యంగా వారు వస్తున్నారని కన్నబాబు పేర్కొన్నారు. పేదల పక్షపాతి జగన్‌కు మరోసారి చాన్స్ ఇచ్చి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, సినీ దర్శకుడు కల్యాణ్ కృష్ణ, సీనియర్ నాయకుడు గోపుశెట్టి బాబ్జీ, స్థానిక నాయకులు పులపకూర వీర్రాజు, బొడ్డు శ్రీను, ఇసరపు అప్పారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాకలపూడిలో అభిమానులు సమక్షంలో సినీ దర్శకుడు, ఎమ్మెల్యే కన్నబాబు సోదరుడు కల్యాణ్‌కృష్ణ జన్మదిన వేడుకలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకుల సమక్షంలో బర్త్‌డే కేక్ కట్ చేశారు.

27న కార్తిక దీపోత్సవం



కరపలో దీపాల సంబరానికి శివపార్వతులను నిలిపి, భజనచేస్తున్న భక్తులు

కరప: గ్రామంలో శుక్రవారం 19వ కార్తిక దీపోత్సవాన్ని ప్రారంభించారు. ఏటా కార్తికమాసం మూడో సోమవారం భక్తులిచ్చిన విరాళాలతో దీపాల సంబరం జరుపుతారు. మూడు రోజుల ముందుగా శివపార్వతులను నిలిపి, కేదారేశ్వరస్వామికి పూజలు చేశారు. 27న కార్తిక దీపోత్సవం జరుపుతామన్నారు. ఆ రోజు కోటి కార్తిక దీపాలు వెలిగించి, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు.

వొకేషనల్ కోర్సులతో ఉపాధి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న హెచ్ఎం, కెరీర్ గైడెన్స్ ఉపాధ్యాయుడు

కరప: ఐటీఐ, పాలిటెక్నిక్ వంటి వొకేషనల్ కోర్సులు చదివితే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయని హెచ్ఎం ఎ.సాయిమోహన్ తెలిపారు. గురజనాపల్లిలోని పబ్బిసీడి పాపారావు జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఆయన 10వ తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. కెరీర్ గైడెస్స్ ఉపాధ్యాయుడు ఐ.ప్రసాదరావు మాట్లాడుతూ బాలికలు టైలరింగ్, పెయింటింగ్, వంటలు, నర్సింగ్ వంటి కోర్సులు అభ్యసించి ఉపాధి పొందవచ్చన్నారు. ఉపాధ్యాయులు జి.అర్జునరావు, ఎ.సూర్యనారాయణ, టి.వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

40 ఏళ్ల కల నెరవేరిన వేళ..

- 92 కుటుంబాలకు భూ హక్కు పత్రాల పంపిణీ
- ఎమ్మెల్యే ద్వారంపూడి చొరవతో లబ్ధి



హక్కు పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: నాలుగు దశాబ్దాలుగా సొంత జాగా లేక ఇబ్బంది పడుతున్న ఆ పేదల కల ఎట్టకేలకు నెరవేరింది. 'గడప గడపకూ మన ప్రభుత్వం' వీరి సమస్యకు పరిష్కారం చూపింది. నగరంలోని ఎనిమిది, తొమ్మిది డివిజన్లలో జరిగిన గడప గడపకూ మన ప్రభుత్వంలో అక్కడి పేదలు నలభై ఏళ్లుగా పూరిళ్లలో నివసిస్తున్న విషయాన్ని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి గుర్తించారు. తామున్నచోటే పట్టాలు ఇవ్వాలని అక్కడి పేదల అభ్యర్థన మేరకు ఆయన వారికి ధైర్యం చెప్పి పేదల పక్షాన ప్రభుత్వం ఉందని భరోసా ఇచ్చారు. అనంతరం రెవెన్యూ అధికారులతో వారి పట్టాల విషయాన్ని చర్చించి పరిష్కారానికి దారి చూపారు. శుక్రవారం తన కార్యాలయం వద్ద ఆయా డివిజన్లలోని పేదలను ఉన్న స్థలాలకే యజమానులుగా చేస్తూ 92 మందికి హక్కు పట్టాలు అందజేశారు. దీంతో ఆ పేద కుటుంబాలు ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్యే ద్వారంపూడికి కృతజ్ఞతలు తెలిపారు. నలభై ఏళ్లుగా నివాసిస్తున్నా ఏ ఒక్కరూ తమ గోడు వినలేదని, కానీ గడప గడపకు మన ప్రభుత్వం తమ సమస్యకు దారి చూపించిందంటూ ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ద్వారంపూడి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ వీరభద్రరెడ్డి, ఆర్గనైజర్ కర్రి వీరెడ్డి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, జేసీఎస్ కన్వీనర్ సుంకర విద్యాసాగర్, మాజీ కార్పొరేటర్ కంపర బాబి, బళ్ల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా వెంకన్నబాబు సంబరం

కరప: మండలం పెనుగుదురులో గురువారం రాత్రి వెంకన్నబాబు సంబరాన్ని వేడుకగా నిర్వహించారు. ఏటా కార్తిక శుద్ధ ఏకాదశి రోజున స్వామికి కల్యాణం నిర్వహిస్తారు. వారం రోజులుగా ఏకాహాలు నిర్వహించారు. పెనుగుదురు, పరిసర గ్రామాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, సర్పంచ్ రెడ్డిపల్లి వెంకట మాధవి, ఎంపీటీసీ సభ్యురాలు బండారు సుజాత, వైఎస్సార్ సీపీ నాయకులు రెడ్డిపల్లి రమేష్; బండారు వెంకటేశ్వరరావు, వివిధ పార్టీల నాయకులు, ఇతర ప్రజాప్రతినిధులు వేడుకల్లో పాల్గొని స్వామికి పూజలు చేశారు. ఆలయ కమిటీవారు ఏర్పాట్లు చేశారు. ఎస్ఐ ఎన్. రామకృష్ణ సిబ్బందితో కలసి బందోబస్తు నిర్వహించారు.



శ్రీ, భూ సమేత వేంకటేశ్వరుని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కన్నబాబు

దేదీప్యం దీపోత్సవం



దీపోత్సవంలో పాల్గొన్న భక్తులు

కాకినాడ రూరల్: పవిత్ర కార్తికమాసం.. ఆపై అమ్మవారికి ప్రీతికరమైన శుక్రవారం.. మహాశక్తి యాగం వేదిక భక్తులతో నిండిపోయింది. లలితా కుంకుమార్చనలకు నిత్యం 12వేల నుంచి 15వేల వచ్చే భక్తులు శుక్రవారం సుమారు 20 వేల మంది హాజరయ్యారు. ఉదయం నక్షత్ర పూజ, తిథి పూజలు, కుంకుమ పూజల వేదిక నుంచి హరిద్వార్‌కు చెందిన శ్రీ నారాయణానంద భారతీ స్వామిజీ ఆశీర్వచనాలు, విశాఖపట్నం వైభవ వెంకటేశ్వరస్వామి దివ్యక్షేత్రానికి చెందిన శేషాచార్యులు ఆధ్యాత్మిక ప్రవచనం అందించారు. పరిపూర్ణానంద స్వామిజీ భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. కుంకుమార్చనల అనంతరం భక్తులు అన్న ప్రసాదం అందించారు. సాయంత్రం దీపోత్సవ ప్రాంగణంలో హైదరాబాద్‌కు చెందిన షణ్ముఖ్ భరద్వాజ్ రాఘవేంద్ర కశ్యప్ దత్త సాయి, సుభాష్, హరి వంశీ వేద కచేరీతో ఆకట్టుకున్నారు. పరిపూర్ణానంద స్వామీజీ దీపోత్సవం విశిష్టతను తెలియజేశారు. రాత్రి బగళాముఖి హోమం నిర్వహించారు.



వేదికపై ఉత్సవ మూర్తులైన శివపార్వతులకు హారతి ఇస్తున్న పరిపూర్ణానంద స్వామి

ప్రజలకు చేరువగా.. పేదలకు తోడుగా..

- జగన్నాథపురంలో వైఎస్సార్ సీపీ కార్యాలయం
- ప్రారంభించిన ఎమ్మెల్యే ద్వారంపూడి



పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి

కాకినాడ: రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు చేరువగా ఉండటంతో పాటు నైపుణ్యం కలిగిన మహిళలు, యువతకు అండగా నిలిచేందుకు జగన్నాథపురం–యానాం రోడ్డులో ఏర్పాటు చేసిన వైఎస్సార్ సీపీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ద్వారంపూడి చారిటబుల్ ట్రస్ట్ పేరిట ఏర్పాటు చేసిన ఈ కార్యాలయంలో స్థానిక ప్రజలు వివిధ సమస్యలను చెప్పవచ్చని ఎమ్మెల్యే సూచించారు. ట్రస్ట్ చైర్మన్ వీరభద్రారెడ్డి నిర్వహణలో ఈ కార్యాలయం పనిచేస్తుందని రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు మరింత అందుబాటులో ఉండేలా ఇక్కడ నుంచి కూడా పార్టీ కార్యకలాపాలు కొనసాగిస్తామని ఎమ్మెల్యే చెప్పారు. అదే సమయంలో టైలరింగ్‌తో పాటు వివిధ అంశాలపై మహిళలకు, యువతకు శిక్షణను ఇచ్చి అవసరమైన వారికి జీవనోపాధి కోసం ట్రస్టు తరఫున తోడ్పాడతామని చంద్రశేఖర్‌రెడ్డి చెప్పారు. ట్రస్ట్ చైర్మన్ వీరభద్రారెడ్డి మాట్లాడుతూ టైలరింగ్, ఎంబ్రాయిడరీ, స్పోకెన్ ఇంగ్లిష్‌లపై శిక్షణతో పాటు స్వయం ఉపాధి కల్పించేందుకు ట్రస్ట్ పేదలకు అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, మాజీ డెప్యూటీ మేయర్లు చోడిపల్లి ప్రసాద్, మీసాల ఉదయ్‌కుమార్, స్థానిక నాయకులు అబ్దుల్ బషీరుద్దీన్, విళ్ల సత్యనారాయణ, ఎంజీకే కిశోర్, పలువురు మాజీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉమ్మడి కుటుంబాలను కాపాడుకోవాలి



వృద్ధులకు దుస్తులు పంపిణీ చేస్తున్న క్లబ్ సభ్యులు

బాలాజీచెరువు: సమాజంలో నానాటికీ కనుమరుగవుతున్న ఉమ్మడి కుటుంబ వ్యవస్థను కాపాడుకోవాలని అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ కమిటీ చైర్మన్ చప్పిడి వేంకటేశ్వరరావు పేర్కొన్నారు. అలయన్స్ క్లబ్ కాకినాడ, స్వాతి హెల్పింగ్ హ్యాండ్స్ సంయుక్తంగా తురంగా వృద్ధాశ్రమంలో శుక్రవారం వస్త్ర, అన్నదానాలు చేశారు. క్లబ్ సభ్యులు సబితా రెడ్డి, మాధురి కార్యక్రమానికి సహకరించారు. క్లబ్ కార్యదర్శి పెంకే గోవిందరాజు, ఉపేంద్రనాథ్, సతీష్ పాల్గొన్నారు.

అలసత్వం, పైరవీలు లేని పాలన

- అదే జగనన్న పాలనా వైవిధ్యం
- వై ఏపీ నీడ్స్ జగన్‌లో ఎంపీ గీత
- పాల్గొన్న ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: సమాజ ఉద్ధరణకు పాటుపడ్డ బీఆర్ అంబేడ్కర్, పూలే వంటి మహానుభావులు కలలుగన్న అలసత్వం, పైరవీలు లేని పాలనను రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారని ఎంపీ వంగా గీత పేర్కొన్నారు. స్థానిక రామకృష్ణారావుపేటలో శుక్రవారం జరిగిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డితో కలసి లబ్ధిదారుల ప్రదర్శన బోర్డును ఆవిష్కరించారు. అనంతరం లబ్ధిదారుల సమావేశంలో ఎంపీ గీత మాట్లాడుతూ సీఎం జగన్ అధికారంలోకి వచ్చాక మౌలికమైన ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టారన్నారు. తన పనితీరు, సంక్షేమ పథకాలు నచ్చితేనే ఓటు వేయమని ఏ ముఖ్యమంత్రి అడగని విధంగా జగన్ ప్రజలను కోరుతున్నారంటే ఆయన హయాంలో జరిగిన పాలనను అర్ధం చేసుకోవచ్చన్నారు. ఉమ్మడి గోదావరి జిల్లాల ప్రధాన ఆస్పత్రి జీజీహెచ్‌లో కోట్లాది రూపాయలు వెచ్చించి మహిళా శిశు విభాగాలను అభివృద్ధి చేయడంతో పాటు కేథల్యాబ్, ఎంఆర్ఐ యూనిట్లను నెలకొల్పామన్నారు. చేసిన అభివృద్ధిని, సంక్షేమాన్ని చూసి ప్రజలు మరోసారి జగన్ ప్రభుత్వాన్ని గెలిపించాలన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ గీత, చిత్రంలో ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి తదితరులు

ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ కల్లబొల్లి మాటలతో ప్రజలను మాయ చేసేందుకు వస్తున్న చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లను నమ్మవద్దని కోరారు. మోసపూరిత వాగ్దానాలు చేసే నేతలకు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలన్నారు. సమావేశం అనంతరం పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, మాజీ డిప్యూటీ మేయర్ మీసాల ఉదయ్‌కుమార్, మాజీ కార్పొరేటర్ రోకళ్ల సత్యనారాయణ, స్థానిక నాయకులు పోలిశెట్టి పద్మావతి బోరా వెంకటేశ్వరరావు (పెద్ద) తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రపాలెంలో..

కాకినాడ రూరల్: మండలంలోని ఇంద్రపాలెం గ్రామ సచివాలయం – 3 వద్ద శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ నిర్వహించారు. తొలుత సచివాలయం పరిధిలోని లబ్ధిదారులకు అందించిన సంక్షేమ పథకాల జాబితా బోర్డును అధికారులు, ప్రజాప్రతినిధులు ఆవిష్కరించారు. జగనన్న సుపరిపాలన, సంక్షేమ పథకాలు, అభివృద్ధిపై గ్రామ సభలో ఏఎంసీ చైర్మన్ గీసాల శ్రీను, ఈఓ పీఆర్డీ రామాంజనేయులు, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ అనుసూరి ప్రభాకర్ తదితరులు వివరించారు. డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా రూ.27లక్షలు సొమ్ములు లబ్ధిదారులకు ప్రభుత్వం అందించినట్టు తెలియజేశారు. సచివాలయ పరిధిలో రూ.3 కోట్లుతో అభివృద్ధి పనులు జరిగాయన్నారు. అనంతరం వైఎస్సార్ సీపీ నాయకులు గ్రామంలో పర్యటించి జెండా ఆవిష్కరించి, ఏపీకి జగనే ఎందుకు వావాలో తెలియజేశారు.



డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు